# ఉపద్రవం

శ్రీ శివప్రసాద్ తెలుగులో డాక్టరేట్ తీసుకుని, యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన తెలుగులో మంచి కథారచయిత. అనేక కథల పోటీల్లో బహుమతులు గెల్చుకున్నాడు కూడా!

ఒకసారి, ఒక సాహితీసమితి వాళ్ళు. ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంలో ఊళ్ళో గొప్ప పేరున్న శంకర్ అనే డాక్టరుగారికి కూడా, ఆ సమితివాళ్ళ ఆహ్వానం పంపారు. ఊళ్ళో చాలామంది ఆ సన్మాన సభకు వచ్చారు. ఈ డాక్టర్ కూడా వెళ్ళాడు. అక్కడ ఆ సన్మాన సభ వైభవం, శివప్రసాద్‌కి జరిగిన గౌరవ మర్యాదలు చూసిన తర్వాత డాక్టర్ శంకర్‌కి తను ఎందుకు కథారచయిత కాకూడదనే ఆలోచన వచ్చింది.

శంకర్‌కి చాలా పట్టుదల. నాలుగు రోజులు తన క్లినిక్ మూసేసి, కష్టపడి చాలా కాయితాలు తగలేసి, మొత్తం మీద కథ అనబడే ఒక "బ్రహ్మ స్వరూపం" తయారు చేశాడు. ఆ స్వరూపాన్ని ఒక పత్రికా కార్యాలయంలో ప్రవేశింపచేశాడు.

శ్రీమతి శంకర్ తన భర్త కథ రాసినట్లు తెలిస్తే చంపేస్తుంది. అందుకని శంకర్, కొన్నిసార్లు ఆవిడ నిద్రపోయినప్పుడు, ఎందుకైనా మంచిది, మధ్యలో హఠాత్తుగా లేస్తుందేమో అని, మంచం కింద దూరి కథ రాశాడు. పట్టుదలంటే అదే మరి!

పెళ్ళైన కొత్తలో, శ్రీమతి శంకర్ చెప్పింది. "మీరేం చేసిన ఫర్వాలేదు కానీ, కథలు మాత్రం రాయవద్దు. ఒకసారి మా మేనమామ, ఒక కథ రాసి కోర్టు కేసులో యిరుక్కున్నాడు. ఆ కథ ఎవర్నో ఉద్దేశించి రాశాడని అవతల వాళ్ళు కోర్టుకి వెళ్ళారు. ఆ కేసు నాలుగేళ్ళు నడిచింది.

"అసలు నేనెందకు కథ రాస్తాను, రాయను" అన్నాడు, శంకర్.

ఎన్నో రోజులూ, నెలలూ గడిచాయి. శంకర్ రాసిన కథ మాత్రం పత్రికలో రాలేదు. చీకట్లో వేసిన బాణంలాగా కనపడకుండా పోయిందా కథ.

శంకర్ పత్రికా కార్యాలయానికి వెళ్ళి, తన కథ అచ్చు అవలేదు కనుక, ఆ కాయితాలు వెనక్కి ఇచ్చేయ్యమన్నాడు.

"మీరు కథతోపాటు స్టాంప్డ్ కవరు పెడితేనే, మీ కథ వెనక్కి వస్తుంది. లేకపోతే యిన్ని కథల్లో, ఎక్కడని వెతుకుతాం" అన్నారు పత్రికవాళ్ళు.

అసలు పత్రికా కార్యాలయంలో, ఈ కథ అంటేనే ఒకరకమైన అసహ్యం కలిగింది.

ఒకసారి ఎడిటర్, సబ్ ఎడిటర్‌ని పిలిచి, "ఆ! అన్నట్లు శంకర్ రాసిన "ఉపద్రవం" అనే కథ ఏమైంది? చదివావా? ఎలా ఉంది?" అని అడిగాడు.

"నాకు ఆ దస్తూరి అర్థం కావటం లేదు. మీరే చూడండి క్షమించాలి. నావల్ల కాదు" అన్నాడు సబ్ ఎడిటర్.

"ఆ మాట అప్పుడే చెప్పాలి. ఇన్ని రోజులు పెట్టుకోవడంలో, నీ ఉద్దేశ్యమేమిటో నాకు తెలియడం లేదు. వెళ్ళు, నీ పని చూసుకో" అన్నాడు ఎడిటర్, కోపంతో.

తర్వాత, ఎడిటర్ ఆ "ఉపద్రవం", ధైర్యం చేసి యింటికి తీసుకువెళ్ళారు. ఎంత ప్రయత్నం చేసినా ఆయన కూడా చదవలేకపోయారు.

ఎడిటర్‌గారి భార్య టేబుల్ మీదున్న ఆ కథ పేరు చూసి, ఈ "ఉపద్రవం" యింటికి ఎందుక తీసుకొచ్చారు?" అని, అడిగింది.

"ఖర్మ పరిపక్వమైతే యిటువంటి "ఉపద్రవాలు" ఇంటికి కూడా వస్తాయి" అన్నారు ఎడిటర్.

"అసలే ఈ మధ్య వరుసగా తుఫాన్లతో ఛస్తున్నాం. పిల్లలుగల వాళ్ళం. ఈ "ఉపద్రవాలు", "ఉప్పెనలు" "సుడిగుండాలు" యింటికి మాత్రం తీసుకురాకండి" అంది ఆవిడ.

రెండు రోజుల తర్వాత, పక్కింట్లో ఉండే ఒక మెడికిల్‌షాపు ఓనర్ ఎడిటర్‌తో మాట్లాడదామని వచ్చాడు.

"మీరు ఎప్పుడూ యింట్లో చాలా హాయిగా ఉంటారు. అంత చికాగ్గా ఉన్నారేమిటి?" అని అడిగాడు. ఆ మెడికల్ షాపు ఓనర్.

"ఆ ఏం చెపుతాం మా కష్టాలూ, కథలూ! ఇదేదో కథ అనే పదార్థం చదువుదామని తెచ్చాను, ఒక్క వాక్యం కూడా చదవలేకపోయాను" అన్నాడు ఎడిటర్.

"నేను చూస్తాను, ఒకసారి యిలా ఇవ్వండి" అని ఆయన ఆ కథ గడగడా చదివేశాడు.

ఇదేదో డాక్టర్ రాసిన కథ ఏమో అని, అనుమానం వచ్చింది, ఎడిటర్‌కి. "భగవంతుడే మీ రూపంలో వచ్చి ఈ కథా విషయం నాకు తెలియ చెప్పాడు".

"అయ్యో! అంతమాట ఎందుకులెండి" అన్నాడు ఆ మెడికల్ షాపు ఓనరు.

ఆ మర్నాడు ఆఫీస్‌కి వెళ్ళిన తర్వాత స్టాఫ్‌ని పిలిచి చెప్పాడు "ఆ కథా విషయం తెలిసిందని'.

"హమ్మయ్య! ఎలా చదివారు సార్" అన్నారు వాళ్ళు. "చదివించినది నేను. చదివినది ఒక మెడికల్ షాపు ఓనర్" అని చిద్విలాసంగా నవ్వారు ఎడిటర్.

అసలు కథా విషయం తెలుసుకోవాలన్న "కథన కుతూహలం" ఎక్కువయింది వాళ్ళకి.

ఆ కథ ఎట్టిదనిన, అని మొదలుపెట్టి 'ఒక వ్యక్తి ఎడ్యుకేషన్ లోన్ తీసుకుని, డాక్టర్ కోర్సు చదివి, గవర్నమెంట్ ఉద్యోగం రాక, మళ్ళీ అప్పుచేసి, ఒక కాలనీలో ఒక క్లినిక్ పెట్టాడు. ఆ చుట్టూ ఉన్న జనానికి జబ్బులు రాలేదు.ఎప్పుడూ ఆరోగ్యంగా ఉన్న. వాళ్ల వలన ఆదాయం లేదు. ఆదాయం లేని కుర్ర డాక్టర్ కృంగిపోయాడు. అప్పులు తీర్చే విధానం లేదు. వడ్డీలు చూస్తే పెరిగిపోతున్నాయి. ఎందుకైనా మంచిదని, ప్రజలు జబ్బు పడాలని, పూజలు కూడా చేయించాడు. ఆ పూజలు ఫలించలేదు. ఇక గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకున్నాడు, ఆ డాక్టర్ " అని ముగించారు ఎడిటర్.

"అంటే ఆ డాక్టర్ ఉపద్రవమే, మన ఉపద్రవం అయిందన్నమాట!" అన్నాడు ఒకతను.

"పోనివ్వండయ్యా! పాపం యిది మొదటి కథ అయి ఉంటుందన్నాడు" ఎడిటర్. "అంటే ఏమిటి సార్! ఇంకొక కథ కూడా రాసి మన ప్రాణం తియ్యాలనా అన్నారు స్టాఫ్".

"భయపడకండి! ఇదే ఆఖరి కథలెండి" అన్నారు ఎడిటర్, నవ్వుతూ.

"ఈ "ఉపద్రవం" వచ్చిన తర్వాత, ఎడిటర్ నవ్వడం యిదే మొదటిసారి.

"ఎన్నాళ్లకి మళ్ళీ కళకళలాడుతోంది ఆఫీస్" అనుకుంటూ, కాఫీలు తెప్పించుకు తాగారందరూ.

"మెడికల్ షాపు ఆయన చదివాడంటే ఈ కథ ఎవరో డాక్టర్ రాసినదే" అన్నారు స్టాఫ్ ముక్త కంఠంతో.

"నేనూ అదే అనుకున్నాను. తెలివితేటల్లో మీరు కూడా నాతో సమానం అవుతున్నారు. నా తర్వాత, ఈ పత్రిక ఎలా నడుస్తుందా అని, ఇంకా నాకు బెంగలేదు" అన్నారు, ఆనందభాష్పాలతో ఎడిటర్.

ఈ శుభసందర్భంలో ఒక మంచి జోక్ చెపుతాను వినండి అన్నాడొకతను ఇద్దరు అక్కాచెల్లెళ్లు పెళ్ళైన తరువాత ఒకసారి పుట్టింటికి వచ్చారట. అక్కయ్య అన్నదట చెల్లెలితో. "మా ఆయ్న రాసినది ఎవ్వరూ చదవలేరని" చెల్లెలు అన్నదట. "మీ ఆయన బాగా నయమే! మా ఆయన రాసినది ఆయన చదవలేరు!" ఘొల్లుమని నవ్వారు, అందరూ.

ఆ కథ కాయితాలు ఎలా అయినా తీసుకుందామని ఆఖరి ప్రయత్నంగా శంకర్ ఎడిటర్ని కలిశాడు.

"ఆఫీసులో ఆ కథ, మేము ఒక 'నమూనా'గా పెట్టాం. ఆ కథ ఆత్మశాంతికి ఒక సంతాప సభ కూడా జరిపాం ఆ కాయితాలు ఇచ్చేది లేదు" అన్నారు ఎడిటర్. "ఎందుకు సార్ అంత కోపం" అన్నాడు శంకర్.

"ఎందుకా! ఆ కథ చదవలేక మా కళ్లు పోయినందుకు. ఆ దస్తూరీ కలలో కనిపించి, నేను రెండుసార్లు ఉలిక్కిపడి లేచినందుకు! ఆ కథ గురించి మాకు మాకూ మధ్య పత్రికా కార్యాలయంలో గొడవలైనందుకు. చాలా, ఇంకా చెప్పాలా?" అని గట్టిగా అన్నారు ఎడిటర్.

ఇంక పని అవదని, శంకర్ వెళ్ళి పోయాడు.

"ఎందుకైనా మంచిది. మళ్ళీ వస్తాడేమో" అని, శంకర్ యింటికి ఫోన్‌చేసి, శంకర్ శ్రీమతికి విషయం తెలియపరిచారు. "అది కాదమ్మా! ఎవరు చేసే పనులు వాళ్ళు చేయాలి. ఆయన డాక్టరు అని తెలుసుకున్నాం, టైమ్ యిలా కథలు రాయడంలో ఎందుకు పాడుచేసుకోవడం. ఈసారి మాత్రం ఆయన కనక, ఆ కథ కాయితాలు అడిగితే నేను కోర్టుకి వెళ్ళవలసి వస్తుంది".

“అయ్యో! వింటే కదా సార్! ఈ మగాళ్ళు పెళ్ళాల మాట వినే రోజులు ఎప్పుడో పోయాయి. అంతా కలికాల మహత్యం” అంది శ్రీమతి శంకర్.

శంకర్ ఇంటికి వచ్చిన తర్వాత “ఏమిటి మీరు కథ రాశారట? ఆ కాయితాలు వెనక్కి అడుగుతున్నారట! ఇంక కోర్టుకి వెళతాం అన్నారు ఎడిటర్‌గారు” అంది శ్రీమతి శంకర్.

“అంత మాటన్నాడా! నాకేం కోర్టు కొత్తా, మెడికోలీగల్ కేసుల్లో నేను ఇంతకు ముందు కోర్టుకెళ్ళినవాడినే. నన్ను కూడా వెళ్ళమంటావా కోర్టుకి” అన్నాడు శంకర్.

“పెళ్ళైన కొత్తలోనే చెప్పాను కదా! మిమ్మల్ని కథలు రాయొద్దని. పదిమంది ప్రాణాలు కాపాడవలసిన మీరు వెళ్ళవలసినది కోర్టుకి కాదు, క్లినిక్‌కి! ఆపని చెయ్యండి. నాలుగు డబ్బులు కూడా వస్తాయి” అంది శ్రీమతి శంకర్.

ఆ తర్వాత, డాక్టర్ కథలు రాసిన దాఖలా లేదు.

(ప్రియదత్త సచిత్రవారపత్రిక 18-8-2004)